## ప్రతి పల్లెనూ తీర్చిదిద్దుతాం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



పల్లెపహాడ్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆత్మకూరు(ఎం), మార్చి14 : మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండలంలోని మోదుగుకుంట, కొరటికల్, పల్లెపహాడ్, పారుపల్లి, ఉప్పలపహాడ్, కప్రాయపల్లి, కూరెళ్ల, దుప్పల్లి, నర్సాపురం, లింగరాజుపల్లి, పల్లెర్లలో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, ఎంపీపీ తండ మంగమ్మాశ్రీశైలంగౌడ్, జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, ఎంపీడీఓ నిరంజన్‌వలి, వైస్ ఎంపీపీ పద్మ, పీఆర్‌ఏఈ సునీత, ఎంపీటీసీలు హంసమ్మ, వెంకటేశ్, మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 14 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పిలాయిపల్లి, జూలూరు, కప్రాయిపల్లి, పెద్ద రావులపల్లి, ఇంద్రియాలలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాల్వలను ఆధునీకరణకు నిధులు తెచ్చి రైతాంగానికి సాగునీటిని అందిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన కోసం సీఎం రేవంత్‌రెడి వెయ్యి కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీటీసీ బందారపు సుమలత, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటేశం, లవకుమార్, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని బసవ లింగేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా గురువారం నిర్వహించిన శతఘటాభిషేకంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏనుగు మహిపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### భువనగిరి మండలంలో...

భువనగిరి కలెక్టరేట్ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అనంతారం, తాజ్పూర్, బస్వాపురం, ముస్తాయిలపల్లి, చందుపట్ల, గౌస్‌నగర్, తుక్కాపురం, నందనం, బొల్లేపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



2వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత

మోత్కూరు, మార్చి14 : మున్సిపాలిటీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. గురువారం పట్టణంలోని 1,2,3,4,6,11 వార్డుల్లో పట్టణ ప్రగతి కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజలు నీటిని వృథా చేయొద్దని, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కారుపోతుల శిరీష, లెంకల సుజాత,మల్లమ్మ, వనం స్వామి పాల్గొన్నారు.



రామన్నపేట : విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, నాయకులు

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు

రామన్నపేట, మార్చి 14 : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని సిరిపురం జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్రారవీందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు కూనూరు మత్తయ్య సమకూర్చిన పరీక్ష సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, ఎంపీటీసీ రమేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాజాపేట : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని నెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసూన, భారతి, బుగ్గారెడ్డి, హసనొద్దీన్, మల్లేశం పాల్గొన్నారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపకుడు కురిమేటి నవీన్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగమల్లు, ఉప్పలయ్య, కృష్ణ, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ

చౌటుప్పల్, మార్చి14 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి హైస్కూల్‌కు రూ.2 లక్షల విలువైన కంప్యూటర్లను ఎన్‌ఆర్‌ఐ బండారు మయూర్‌రెడ్డి బహూకరించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వాటిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, డీఎల్‌రెడ్డి, మూర్తి, సత్తయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్యోత్సవాలు




సువర్ణమూర్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మార్చి14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. స్వామికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవ మూర్తుల పాదాల వద్ద బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.17,04,974 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

### స్వామివారికి గొడుగు, దిండ్ల బహూకరణ

లక్ష్మీనరసింహస్వామికి హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన రామాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శయనోత్సవంలో ఉపయోగించే దిండ్లు, 750 గ్రాముల ఇలాచీ దండలు, గొడుగు బహూకరించారు. ఆలయ ఈఓ రామకృష్ణారావుకు అందజేశారు. కార్యక్రమంలో రామాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యురాలు అలివేలు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గజవెల్లి రఘు, ఆలయ పర్యవేక్షకుడు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



ఆలయ ఈఓ రామకృష్ణారావుకు గొడుగు, దిండ్లు, ఇలాచీ దండలను అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, అలివేలు



వెంకటేశ్వరుడి ఆభరణాలతో వస్తున్న ఆలయ ధర్మకర్తలు

## వెంకటేశ్వరుడి ఆలయంలో పూర్ణప్రతిష్ఠ పూజలు

రాజాపేట, మార్చి 14 : మండలంలోని రేణికుంట శివారులో రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన సంకల్పసిద్ధి వెంకటేశ్వరాలయంలో పీఠాధిపతులు శ్రీమాన్ బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ, శ్రీమాన్ గౌతమ్‌కృష్ణ ఆధ్వర్యంలో గురువారం మూడోరోజు పూర్ణప్రతిష్ఠ పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా సంకల్పం, త్రిషోడశకలశ ఆసాధన, హోమాలు, చతుర్వేదపారాయణం, దిగ్దేవతా బలి పూజలు నిర్వహించారు. కార్యకమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కూర కల్యాణీబద్రీనాథ్, కుంబాల శోభారాణీఎల్లారెడ్డి, సూదిరెడ్డి కళావతీనాగిరెడ్డి, శ్రీవట్టం మంజులారాఘువేంద్ర, సమ్మెట రాజేశ్వరీశ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న విశ్వకర్మ సంఘం సభ్యులు

## వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

చౌటుప్పల్ రూరల్, మార్చి 14 : మండలంలోని దండుమల్కాపురంలో గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణాన్ని విశ్వకర్మ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం రథోత్సవంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు యల్లంకి రమేశ్ చారి, కార్యదర్శి చేపూరి శ్రీధరాచారి, ఉపాధ్యక్షుడు పర్వతం సంతోష్‌చారి, కొండోజు సత్యనారాయణ, యల్లంకి ఆనంద్‌చారి, దిలిప్‌చారి, శారదాంబ, పర్వతం మాధవి, యల్లంకి ఉపేంద్ర, యల్లంకి లక్ష్మణాచారి పాల్గొన్నారు.

## డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు నల్లగొండలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండు నెలలు ఉచిత వసతితో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు నల్లగొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాలకు సంబంధించి 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆయా జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు ఉంటుందని తెలిపారు. అర్హులు ఈ నెల 26లోగా http://.tsscstudy circle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8465035932, 9603167257 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవని తాసీల్దార్ అంజిరెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని అనంతారంలో సర్వే నంబర్ 291లోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

మోత్కూరు, మార్చి14 : స్థానిక బస్టాండ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండలాధ్యక్షుడు సత్యనాథ్, జిల్లా సభ్యుడు ఎస్‌ఎన్ చారి, మండల ప్రతినిధులు మధు, అనిల్, ప్రసాద్, అంజయ్య, వేణు, నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రీ స్కూల్‌పై అవగాహన

బొమ్మలరామారం, మార్చి 14 : మండలంలోని మైలారంతండా, మైలారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లులు, బాలింతలకు ప్రీ స్కూల్ బోధనా పద్ధతులపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుల్తానా, బాలింతలు, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

## 30న రామన్నపేట ఎంపీపీపై అవిశ్వాసం

రామన్నపేట, మార్చి14 : రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిపై ఈ నెల 30న అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ కాంగ్రెస్, సీపీఎంకు చెందిన 10 మంది ఎంపీటీసీలు జనవరి 4న చౌటుప్పల్ ఆర్డీఓకు నోటీసు ఇచ్చారు. దాంతో ఎంపీపీ హైకోర్టులో పిటిషన్ వేశారు. జనవరి 23న కోర్టు స్టే విధించింది. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు ఈ నెల 12న స్టేను రద్దు చేసింది. దాంతో 30న 11గంటలకు ఓటింగ్ నిర్వహించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీలకు ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు.

### నేటి నుంచి ఒంటిపూట బడులు

భువనగిరి అర్బన్, మార్చి 14 : జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. 712 ప్రభుత్వ, 156 ప్రైవేటు పాఠశాలలో ఏప్రిల్ 23 వరకు కొనసాగనున్నాయి. కాగా, ఏప్రిల్ 8 నుంచి 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ-2 పరీక్షలు జరుగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 12:30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టి పంపించనున్నారు. ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1నుంచి 5 గంటల వరకు బడి నిర్వహించనున్నారు.

## అక్రమ నిర్మాణాల పరిశీలన

బీబీనగర్, మార్చి 14 : మండల కేంద్రంలోని లెప్రసీ కాలనీలో గత ప్రభుత్వం కుష్టు రోగుల కోసం రెండెకరాల భూమిని కేటాయించింది. మూడు కుటుంబాలకు ఇండ్లు నిర్మించి పట్టాలు అందజేశారు. ఈ క్రమంలో ఎల్లమ్మ అనే మహిళ తనకు తెలిసిన బంధువులు, ఇతర కుటుంబాల వారికి ఇంటి స్థలం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి సుమారు 20 ఇండ్లు అక్రమంగా నిర్మిస్తున్నట్లు కాలనీవాసులు ఆరోపించారు. దాంతో గురువారం ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి అధికారులతో కలిసి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని, ఎల్లమ్మపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్ స్కూల్‌లో షెడ్యూల్ తెగల విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ హనుమంత్ కె.జెండగే లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లాకు సంబంధించి బాలురు-3, బాలికలు-2 చొప్పున సీట్లు కేటాయించారు. ఎంపికైన విద్యార్థుల్లో ధరావత్ మహేశ్‌బాబు, కేతావత్ మణిదీప్ రాథోడ్, భూక్యా రిత్విక్, బానోతు గాయత్రి, బానోతు హిమవర్షిణి ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ క్రిష్ణన్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోం


భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బెన్‌షాలోం గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

## ఎండిన పంటల పరిశీలన

ఆత్మకూరు(ఎం), మార్చి 14 : మండలంలోని కూరెళ్లలో గురువారం ఎండిన పంట పొలాలను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికి 60 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు ఎండిపోయాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం అందివ్వాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం, నాయకులు రాములు, రాజమల్లు, భిక్షం, లక్ష్మి, సోమయ్య, వెంకటయ్య ఉన్నారు.




కూరెళ్లలో ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రామన్నపేట, మార్చి14 : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 24 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేస్తుందని, మరో రెండు గ్యారెంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు వనం హర్షిణి, మడూరి జ్యోతి, పూస బాలమణి, గాదె పారిజాత, గోగు పద్మ, నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి, పున్న జగన్‌మోహన్, జింకల ప్రభాకర్, అక్రం, రచ్చ రమేశ్, జమీరొద్దీన్, సాల్వేరు లింగం పాల్గొన్నారు.



చౌటుప్పల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర

## రైతుబంధు ఇవ్వలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

సంస్థాన్‌నారాయణపురం/చౌటుప్పల్, మార్చి14 : అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఐదెకరాల వరకు కూడా రైతుబంధు ఇవ్వలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. గురువారం సంస్థాన్‌నారాణపురంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక, పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే తప్పించుకోవచ్చని చూస్తున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయని అన్నారు. అలాగే చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్ బాధితులపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికభారం మోపుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసిందని, అధికారంలోకి రాగానే ముక్కుపిండి ఎల్‌ఆర్‌ఎస్ వసూలు చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి ఎంపీ సీటు గెలిచి ప్రధాని మోదీకి కానుకగా అందిస్తానని అన్నారు. ఆయా సమావేశాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, కర్నాటి ధునుంజయ్య, దూడల భిక్షం గౌడ్, బచ్చనబోయిన దేవేందర్, జక్కలి రాజు, తంగెళ్ల సత్తయ్య, రమణగోని శంకర్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, మార్చి 14 : మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 6, 12వ వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆలె నాగరాజు, తాడూరి శిరీషాపరమేశ్, నాయకులు బాలరాజుగౌడ్, నర్సింహాగౌడ్, స్వామి, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థినికి స్కూల్ ఫీజు చెల్లింపు

భువనగిరి అర్బన్, మార్చి 14 : పట్టణంలోని ప్రెసిడెన్సి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జెనిగల ప్రదీప్తికి యువ టీం కన్వీనర్ సూదగాని రాజు స్కూల్ ఫీజు రూ.38 వేల చెక్కును పాఠశాల యాజమాన్యానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారంతో బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, సభ్యులు సురేశ్, రాజు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటీ బచావో.. బేటీ పడావో



చీరలు, ఫ్రాక్‌లు అందజేస్తున్న సమీరా మీర్జాన్

చౌటుప్పల్, మార్చి14 : చౌటుప్పల్ సెక్టార్‌లోని 4, 6, 7, 8, 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తల్లులు, పిల్లలను చీరలు, ఫ్రాక్‌లతో సన్మానించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సమీరా మీర్జాన్, సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## లింగ బసవేశ్వరుడి హుండీ ఆదాయం రూ.10,58,973

బీబీనగర్, మార్చి 14 : మండలంలోని పడమటిసోమారంలో గల లింగ బసవేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఇటీవల ముగిశాయి. గురువారం దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ చైర్మన్ సందిగారి బసవయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. రూ.10,58,973 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు సుమతి, నరేందర్‌రెడ్డి, ధర్మకర్తలు ఆలేటి బలరాం, ఆల్వ గోపాల్‌రెడ్డి, వంటల శ్రీశైలం, నడికుడి వెంకటేశ్, బుర్రి శివలింగం, గౌరికంటి సుజాత, పూజారులు రాంసింగ్, పుణ్యసింగ్, రాజశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం



రామన్నపేట : ఉపాధ్యాయులతో విద్యార్థులు

రామన్నపేట, మార్చి14 : మండలంలోని జనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులు, అధికారులుగా విధులు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు యాదగిరి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూరెళ్ల భాస్కరాచారి, వసంత, నర్సింహారెడ్డి, శంకర్, జాన్‌రెడ్డి, జెబున్నిసాబేగం పాల్గొన్నారు.